# ప్రతిభ



ద్వైమాసిక పత్రిక సంచిక-4
(మార్చి, ఏప్రిల్)

## తెలుగు శాఖ

## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్

### దేశభాషలందు తెలుగు లెస్స



ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు



బుర్రకథా పితామహుడు నాజర్ గారు



మాడపాటి హనుమంత రావు గారు



శ్రీరంగం శ్రీనివాసరావు గారు

# ప్రతిభ

## ద్వైమాసిక పత్రిక (మార్చి, ఏప్రిల్)

**గౌరవ సంపాదకులు:**
డా. జి సుకన్య గారు,
ప్రధానాచార్యులు
**ప్రధాన సంపాదకులు:**
డా.జె. భారతి,
తెలుగు శాఖ అధ్యక్షులు
**సంపాదక సహకారం:**
తెలుగు శాఖ అధ్యాపకులు
మరియు
కళాశాల తెలుగు సంఘం విద్యార్థులు



కళాశాల వ్యవస్థాపకులు
ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు

**లోపలి పుటల్లో...**


ఆలోకన...3
ముఖచిత్ర పరిచయం...4
పోటీ పరీక్షలకు తెలుగు...5
విద్యార్థుల రచనలు...8
పదకేళి...17
సాహిత్య రత్నాలు...18
మాతృభాషా దినోత్సవం...22
మీకు తెలుసా!...23
ఓ మంచి పద్యం...25
పదవినోదం...26
కళాశాల వార్తా కదంబం...27


నూరు పువ్వులు వికసించనీ వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ

# ఆలోకన

విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం ।
పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం తతస్సుఖమ్॥

సరైన విద్య వినయాన్ని ఇస్తుంది. ఆ వినయం అర్హతని కలుగజేస్తుంది. దాని వలన ధనం సమకూరుతుంది. ఆ విధంగా సంపాదించిన ధనంతో ధర్మ మార్గంలో పనిచేస్తే సుఖం కలుగుతుంది అని పై శ్లోకార్థం.

జీవన విధానం ఏ మనిషికైనా ఎలా సాగాలో తెలియజేస్తున్న ఇటువంటి శ్లోకాలు పద్యాలతో కూడిన సాహిత్యం చదవటం వలన వ్యక్తిత్వ వికాసానికి పునాదులు బలంగా ఏర్పడతాయి. ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణులవటానికి కావలసినంత చదువుకుంటే చాలు అనే ఆలోచనతో వారి వ్యక్తిత్వానికి బలమైన పునాదులు ఏర్పడటంలేదనే విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. లాంగ్వేజి తరగతులు ప్రధానమైనవి కావనే అభిప్రాయం విద్యార్థులతో పాటు కొందరు అధ్యాపకులకు కూడా ఉండటం అక్కడక్కడ చూస్తున్నాం. భాషా సాహిత్యాలు చదవటం అనేది వ్యక్తిత్వ వికాసానికి విద్యార్థి పురోగతికి మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలకు కూడా ఉపయోగిస్తుందనేది సామాజిక అధ్యయనవేత్తలు చెపుతున్న మాట. సాంకేతికతతో పాటు విస్తరిస్తున్న ప్రసారమాధ్యమాలు భాషాసాహిత్యాలను సరిగ్గా చదివిన విద్యార్థులకు ఉపాధి కల్పించటానికి పోటీ పడుతున్నాయి. పై శ్లోకంలో చెప్పినట్టు సరైన విద్య నేర్చుకున్న విద్యార్థి తన అర్హతను పెంచుకొని ఈ పోటీని తన అభివృద్ధికి మెట్టుగా మలుచుకోగలుగుతాడు. మా విద్యార్థులందరూ ఆ విధంగా అభివృద్ధిని సాధించాలని మా ఆకాంక్ష. అందుకోసమే పోటీ పరీక్షలకు కూడా ఉపయోగించేవిధంగా ఈ పత్రిక నిర్వహిస్తున్నాం.

కొన్ని అనివార్య కారణాల వలన జనవరి-ఫిబ్రవరి నెలలకు సంబంధించిన ద్వైమాస పత్రికను విడుదల చేయలేకపోయాం. ఆ రెండు నెలలకు సంబంధించిన సాహితీవేత్తల వివరాలు మరియు కళాశాల వార్తా వివరాలు ఈ పత్రిక ద్వారా అందిస్తున్నాం.

ఈ పత్రికా నిర్వహణలో నిరంతరం సహకరిస్తున్న మా పూర్వవిద్యార్థి చి. అభిలాష్ కు శుభాభినందనలు. పత్రికను నిర్వహించమని నిరంతరం ప్రోత్సహిస్తున్న ప్రధానాచార్యులు డా.జి.సుకన్య గారికి ధన్యవాదాలు. విద్యార్థులందరికీ శుభాశీస్సులు.

--డా. జె. భారతి

ప్రధాన సంపాదకులు

# ముఖచిత్ర పరిచయం



మొట్ట మొదటిసారిగా ఆంధ్ర సాహిత్య చరిత్రను రచించి చరిత్ర సృష్టించిన పింగళి లక్ష్మీకాంతం 1894 జనవరి 10న జన్మించారు. ఈయనను గురించి లోపలి పుటల్లో తెలుసుకోండి.



ఆంధ్ర కవితా పితామహుడుగా పేరుగాంచిన మాడపాటి హనుమంత రావు గారు 1885 జనవరి 22న జన్మించారు. ఈయన జీవిత విశేషాలను లోపలి పుటల్లో తెలుసుకోండి.



బుర్రకథ పితామహుడుగా పేరుగాంచిన షేక్ నాజర్ 1920 ఫిబ్రవరి 5న జన్మించారు. ఈయనకు సంబంధించిన సంక్షిప్త సమాచారం లోపలి పుటల్లో తెలుసుకోండి



ఆధునిక తెలుగు సాహిత్యంలో మైలు రాయిగా, విప్లవ కవిగా నిరక్షరాస్యులకు సైతం పరిచయం ఉన్న కవి శ్రీశ్రీ. ఈయన 1910 ఏప్రిల్ 30న జన్మించారు. ఈయన గురించిన సంక్షిప్త సమాచారం లోపలి పుటల్లో తెలుసుకోండి.

# పోటీ పరీక్షలకు తెలుగు ప్రశ్నావళి

పోటీ పరీక్షలను ఉద్దేశించి తయారుచేసిన తెలుగు సాహిత్య క్విజ్ లో పాల్గొని  కొత్త విషయాలను తెలుసుకోండి..!

**1. నన్నయ భారతంలోని శ్రీవాణీ గిరిజాశ్చరాయ... అనే తొలి శ్లోకం యొక్క ఛందస్సు?**

అ)శ్రీ పదము　　ఆ)మంగళ మహాశ్రీ

ఇ)శార్దూలం　　ఈ)వసంత జలకము

**2. తొలి తెలుగు అచ్చతెనుగు కావ్య కృతిభర్త?**

అ)కృష్ణదేవరాయలు　　ఆ)రఘునాథరాయలు

ఇ)మల్కిభరాముడు　　ఈ)అమీన్ ఖాన్

**3. 'వలపలగిలక' అంటే?**

అ)మంచి గిలక　　ఆ)ద్విత్వాక్షరం

ఇ)ఆటవస్తువు　　ఈ)రేఫకు చిహ్నం

**4. "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా" అన్న కవి?**

అ)రామరాజ భూషణుడు　　ఆ)చేమకూర వెంకటకవి

ఇ)కూచిమంచి జగ్గకవి　　ఈ)ముద్దుపళని

**5. "ఒకడు నాచన సోమన" రచన ఎవరిది?**

అ)పల్లా దుర్గయ్య　　ఆ)రాయప్రోలు సుబ్బారావు

ఇ)విశ్వనాథ సత్యనారాయణ　　ఈ)గుర్రం జాషువా

**6. చిక్కనవుతున్న పాట...**

అ)స్త్రీవాద కవిత్వ సంకలనం　　ఆ)దళితకవితా సంకలనం

ఇ)అనుభూతివాద కవితా సంకలనం　　ఈ)మానతావాద సంకలనం

**7. "లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా" రచయిత?**

అ)ఎం.బి.ఎమెనో ఆ)సర్ జార్జ్ గ్రియర్సన్

ఇ)రాబర్ట్ కాల్ట్ వెల్ ఈ)ఫ్రాన్సిస్వైట్ ఎలిస్

**8. "నా భారతదేశ యాత్ర" రచన ఎవరిది?**

అ)దాశరథి ఆ)సురవరం

ఇ)శ్రీశ్రీ ఈ)కాళోజీ

**9. తన లేఖినిని "నిత్య వర్చస్విని" అని ఎవరు పేర్కొన్నారు?**

అ)ఖండవల్లి లక్ష్మీరంజనం ఆ)తల్లావఝుల శివశంకర శాస్త్రి

ఇ)గురజాడ అప్పారావు ఈ)రాయప్రోలు సుబ్బారావు

**10. "కొల్లాయి గట్టితేనేమి – మా గాంధీ కోమటై పుట్టితేనేమి" అన్నది?**

అ)అక్కిరాజు ఉమాకాంతం ఆ)గరిమెళ్ళ సత్యనారాయణ

ఇ)బసవరాజు అప్పారావు ఈ)దువ్వూరి రామిరెడ్డి

11. **కప్పి చెప్తే కవిత్వం విప్పి చెప్తే విమర్శ అని అన్న విమర్శకుడు?**

అ) సినారె ఆ) శ్రీశ్రీ

ఇ) విశ్వనాథ ఈ) దాశరథి

**12. దండి రచించిన గద్య కావ్యం?**

అ) కాదంబరి ఆ) హర్షచరిత్ర

ఇ) వాసవదత్త ఈ) దశకుమార చరిత్ర

**13.ఈ వరుసలో ఇమడని వారు?**

అ) సినారె ఆ) రావూరి భరద్వాజ

ఇ) విశ్వనాథ ఈ) ఎన్ గోపి

**14. ఊర్వశి వీరి ఊహాప్రేయసి?**

అ) విశ్వనాథ ఆ) వేదుల

ఇ) రాయప్రోలు ఈ) దేవులపల్లి

**15. పుట్టుకనీది చావు నీది బ్రతుకంతా దేశానిది అన్నవారు?**

అ) రాయప్రోలు ఆ) కాళోజీ

ఇ) సినారె ఈ) చలం

**16. వచనకవితా పితామహుడు?**

అ) పఠాభి ఆ) కుందుర్తి ఆంజనేయులు

ఇ) తిలక్ ఈ) సినారె

**17. ప్రథమాంధ్ర ప్రబంధం?**

అ) మనుచరిత్ర ఆ) కుమార సంభవం

ఇ) పారిజాతాపహరణం ఈ) పాండురంగ మహాత్మ్యం

**18. దాశరథి శతక కర్త?**

అ) దాశరథి ఆ) కంచెర్ల గోపన్న

ఇ) అడిదము సూరకవి ఈ) బద్దెన

**19. విష్ణుచిత్తీయం అనే పేరుగల కావ్యం?**

అ) కళాపూర్ణోదయం ఆ) ఆముక్తమాల్యద

ఇ) మనుచరిత్ర ఈ) వసుచరిత్ర

**20. ఎఱ్ఱన ఏ రాజు ఆస్థానకవి?**

అ) ప్రోలయ వేమారెడ్డి ఆ) మనుమసిద్ధి

ఇ) రాజరాజ నరేంద్రుడు ఈ) కాటయ వేమారెడ్డి

## సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-ఇ | 6-ఆ | 11-అ | 16- ఆ |
| 2-ఈ | 7-ఆ | 12-ఈ | 17-అ |
| 3-ఈ | 8-ఈ | 13-ఈ | 18-ఆ |
| 4-ఆ | 9-ఈ | 14-ఈ | 19-ఆ |
| 5-ఇ | 10-ఇ | 15- ఆ | 20-అ |

కె. మునికుమార్ గౌడ్

బీఎస్సీ (ఎంపిసిఎస్) రెండో సంవత్సరం


## కాలం పోకడ (కథ)

రెండున్నర ఏళ్ళు కావస్తోంది సూర్య తన డిగ్రీ పూర్తి చేసి,ఇంకా ప్రభుత్వ ఉద్యోగం కోసం పరీక్షలు రాస్తున్నాడు. తనతో పాటు చదువుకున్న మిత్రులు అంతా జీవితంలో చిన్నగా సెటిల్ అవుతున్నారు. అప్పుడు దసరా సినిమా రిలీజ్ అయింది. అప్పుడు సూర్య తన ఫ్రెండ్ త్రివేదికి ఫోన్ చేసి సినిమాకి వెళ్దాం రమ్మని చెబుతాడు సరే అని ఇద్దరు కలిసి సినిమాకి వెళ్లారు.సినిమా మధ్యలో త్రివేదికి ఏదో ఫోన్ వస్తుంది, బయటికి వెళ్లి ఫోన్ మాట్లాడి వస్తాడు కానీ తన ముఖంలో ఏదో బాధని గమనిస్తాడు. సూర్య ఏంటి అని అడిగితే ఏం లేదు అని చెప్పాడు ఇంతలో సినిమా అయిపోతుంది. ఇద్దరు కలిసి బయటికి వచ్చి ఇంటికి బండిమీద వెళుతున్నారు. త్రివేది బండిని డ్రైవ్ చేస్తున్నాడు, సడన్గా లారీకి ఢీకొట్టబోతాడు కొద్దిలో ప్రమాదం తప్పింది బండి ఒకచోట ఆపి, ఏమైందిరా ఇందాక ఫోన్ వచ్చినప్పటి నుండీ నీ ఫేస్లో ఏదో బాధ కనిపిస్తుంది అని త్రివేదిని సూర్య అడుగుతాడు. అప్పుడు త్రివేది నా బాధకు కారణం చెప్పాలి అంటే హైదరాబాద్లో నేను జాబ్ చేస్తున్నప్పుడు జరిగిన ఒక సంఘటన చెప్పాలి రా అని చెప్పసాగాడు.

నేను డిగ్రీలో సబ్జెక్టులు పాస్ అవ్వకపోవడంతో ఖాళీగా ఉండటం ఎందుకని హైదరాబాద్లో మనోజ్ గాడితో కలిసి రూమ్లో ఉంటూ జాబ్ చేస్తున్న రోజులవి. నేను చేస్తున్న బీపీఓ జాబ్ వదిలేసి అప్పుడే కొత్తగా హెచ్డిఎఫ్సి లో జాబ్ లో జాయిన్ అయ్యా చాలా తక్కువ రోజుల్లోనే అక్కడి ఉన్నవారు అంత నాకు చాలా క్లోజ్ అయిపోయారు. అందులో మరీ ముఖ్యంగా అక్కడ ఉన్న అమ్మాయిలు చాలా క్లోజ్ అయ్యారు. వాళ్ళు తెచ్చుకున్న లంచ్ బాక్స్ కూడా నాకే ఇచ్చి తినమనేవారు ఇలా రోజులు గడుస్తున్నాయి అప్పుడు నా లైఫ్ లో ఒక అద్భుతం జరిగింది. కొత్తగా మా ఆఫీసులో ఒక అమ్మాయి చేరింది చూడ్డానికి కొంచెం పొట్టిగా ఉన్న స్వర్గం నుంచి దిగివచ్చిన అప్సరసలా ఉంది తన పేరు ప్రవళిక వాళ్లది కడప అని ఆఫీసులో అందరూ అనుకుంటే నేను విన్నాను. నాలో ఏదో కుతూహలం మొదలైంది తనది నా పక్క క్యాబిన్ సిస్టంలో ఏదో ప్రాబ్లం వచ్చి నన్ను అడిగింది అదే ఆమెను నేను మొదటిసారిగా దగ్గరగా చూడటం, చూసిన వెంటనే ఆమె ప్రేమలో పడిపోయాను ఆమె కంటి చూపులో ఏదో మ్యాజిక్ ఉంది. తన స్మైల్ లో ఏదో స్పార్క్ ఉంది నేను అలానే చూస్తూ ఉండిపోయాను. హే నిన్నే అని తను నా భుజం మీద తాకింది ఒక్కసారిగా నేను తేరుకొని ప్రాబ్లం చూసి సరి చేశాను ఇలా ఆమెను చూస్తూనే చాలా రోజులు అయిపోయాయి ఆఫీసులో నాకు కొన్ని రోజుల తర్వాత తన మొబైల్ నెంబర్ నాకు ఇచ్చింది.

ఇలా చిన్నగా వాట్సాప్ లో చాటింగ్ అప్పుడప్పుడు కాల్స్ కూడా చేసుకునే వాళ్ళం తనతో చాటింగ్ చేస్తుంటే టైం కూడా తెలిసేది కాదు నాకు ఒక్కోసారి అయితే అర్ధరాత్రి 12 గంటల వరకు చాటింగ్ చేసేవాళ్ళ కొన్ని రోజులకి మా ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. ఇలా కొన్ని రోజులు జరిగిన తర్వాత ఒకరోజు వాట్సప్ లో తనతో నేను తనని ప్రేమిస్తున్నానని చెప్పాను తను రెండు రోజులు తర్వాత ఒక స్పెషల్ డే ఉంది ఆ రోజున ఒపీనియన్ చెప్తాను అంది సరే అని నేను ఊరుకున్నాను ఆరోజు రానే వచ్చింది. ప్రవళిక ఫోన్ చేసి ట్యాంక్ బండ్ దగ్గర ఉన్న ఒక రెస్టారెంట్ కి రమ్మని చెప్పింది, తను ఏం చెబుతుందో అని నేను చాలా టెన్షన్ గా లోలోపల చాలా టెన్షన్ పడుతున్నాను నీటుగా రెడీ అయి ఆ చోటికి వెళ్లాను ప్రవళికతో పాటు తన ఫ్రెండ్స్ కూడా ఉన్నారు. అప్పుడే తెలిసింది ఆ రోజు తన పుట్టినరోజు అని అప్పుడు నన్ను పక్కకు పిలిచి కొంత డబ్బులు ఇచ్చి నన్ను బిల్ పే చేయమని చెప్పింది. ఎందుకిలా చెప్తున్నావు? అని అడిగితే నా ఫ్రెండ్స్ కి మా ఆయన బిల్ కడతారు అని చెప్పాను నువ్వు ఏమో నార్మల్గా వచ్చి ఉంటావు అందుకే మనీ ఇస్తున్నాను అని చెప్పింది నేను సరే అన్నాను తర్వాత మనం పెళ్లి చేసుకుందాం అని అంది ప్రవళిక నాకు ఒకవైపు సంతోషంగా ఉన్న నీకు ఒకటి చెప్పాలి అన్నాను ఏంటి అని అడిగింది నేను మీ కులం కాదు అని చెప్పాను అయినా నాకు పరవాలేదు అని చెప్పింది.

నాకు చాలా సంతోషం వేసింది. అలా తన పుట్టినరోజు మా ప్రేమ ప్రయాణం మొదలైంది అప్పటినుంచి మేము ఇద్దరం చాలా గాఢంగా ప్రేమించుకుంటున్నాం. పార్కులకి పబ్బులకి సినిమాలకి అన్నిచోట్ల తిరిగే వాళ్ళం నన్ను తన ఫ్రెండ్ కి పరిచయం చేసింది. అప్పుడే తనకి ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు అని ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నారని చెప్పింది. అయినా తను ఇంటికి వెళ్ళను, ఇంటికి వెళ్తే పెళ్లి చేసేస్తారు అని హైదరాబాదులో ఉంది నేను నిన్నే పెళ్లి చేసుకుంటానని చెప్పింది. కొన్ని రోజుల తర్వాత నేను ఆఫీసులో బిజీగా ఉన్న సడన్గా తన దగ్గర నుంచి ఫోన్ వచ్చింది హెల్త్ బాగాలేదు హాస్పిటల్లో ఉన్నాను అని. నేను వెంటనే హాస్పిటల్ కి వెళ్ళిపోయాను తనకి వైరల్ ఫీవర్ వచ్చింది. అప్పుడే తన ఫ్రెండ్ ఫోన్ చేస్తే మా అమ్మ లాగా చూసుకుంటున్నాడే అని చెప్పగా ఒక్కసారిగా నా కంటిలో నీరు తిరిగాయి.

కొన్ని రోజులకు తన ఆరోగ్యం కుదుటపడింది తర్వాత కొన్ని రోజులు మేము బాగానే ఉన్నాం. ఏమైందో ఏమో కానీ తర్వాత నాతో మాట్లాడటం ఆపేసింది ఫోను కూడా చేయట్లేదు నాకు డిగ్రీ కంప్లీట్ అవ్వలేదు అని తెలిసి కూడా నన్ను ఎంతో ఎంకరేజ్ చేసి త్వరగా సెటిల్ అయితే పెళ్లి చేసుకుందాం అన్న అమ్మాయి ఇలా ఎందుకు ప్రవర్తిస్తుందో నాకు తెలియలేదు.

తర్వాత ఒకరోజు నేనే వెళ్లి తనను కలిసినప్పుడు తను నన్ను ప్రేమించట్లేదు అని చెప్పేసరికి నా గుండె ఆగినంత పని అయింది ఇలా జరిగిన తనమీద ప్రేమ నాకు తగ్గలేదు ఆ బాధతో నేను జాబ్ వదిలేసి ఈ గుంటూరు వచ్చాను.

సూర్య మరి ఇప్పుడు ఎందుకురా బాధపడుతున్నావు అని త్రివేది  అడిగితే ఇంతకుముందు మనం హాల్లో ఉన్నప్పుడు ఫోన్ చేసింది తన ఫ్రెండు రా ఏం చెప్పింది రా అని సూర్య అడిగితే, సినిమాలో చూసినట్టుగా ఒకరితో ప్రేమ ఇంట్లో చూసిన వాళ్ళతో పెళ్లి అనే సంఘటనలను చూసి జాలిపడే వాళ్ళు కానీ అది నిజంగా నా జీవితంలో జరుగుతుంది అనుకోలేదురా అని చెప్తూ, తన కంటి నుంచి వచ్చే కన్నీరును తుడుచుకున్నాడు త్రివేది నన్ను ఎంతో గాఢంగా ప్రేమించాను అని చెప్పిన తను ఇప్పుడు ఇంటిలో చూసిన వాడిని పెళ్లి చేసుకుంటుంది అంటారా.. ఇప్పుడు తన ఫ్రెండ్ చెప్పింది అదేరా. ప్రేమించి మోసం చేయకండి మోసం చేసే వాళ్ళు ప్రేమించకండి తెగించే ముందు ముగించేదాకా నిలబడాలి అని గుర్తించుకోవాలి.

జి. గణేశ్
బీఎస్సీ (ఎంపిసిఎస్) రెండో సంవత్సరం

# మౌన పరిచయం .... (కథ)

వైజాగ్ లో పుట్టి పెరిగిన అర్జున్ ప్రతిరోజు స్కూల్ అయిపోగానే సాయంత్రం అలా సముద్రం దగ్గరికి వెళ్ళి అక్కడి అలలను తన కాళ్లతో తాకుతూ, తనవైపే చూస్తున్నట్టుగా ఉండే చందమామను చూస్తూ, తన అనుమతి లేకుండానే తనని తాకుతూ వెళ్ళే గాలిని ఆస్వాదిస్తూ, ప్రకృతి కన్నా అందమైనది ఏముంటుంది అని ఆలోచనతో ఆ వాతావరణన్ని ఆస్వాదిస్తూ ఉండేవాడు.

ప్రతిరోజూ తన సైకిల్ పై తన స్నేహితులైన వివేక్, హర్షలతో కలసి స్కూల్ కి వెళ్ళేవాడు. చిన్నప్పటి నుండి కలసి ఉండడం వల్ల చాలా చనువుతో ఉండేవారు. అర్జున్ కి చిన్నప్పటినుండి చిత్రాలు గీయడం అలవాటు తన ఆలోచనలను అన్నింటినీ చిత్రరూపంలో భద్రపరిచేవాడు క్రమంగా డ్రాయింగ్ తన జీవితంలో భాగమైపోయింది. అర్జున్ కి చిన్నపటినుండి నాన్న అంటే భయం, బహుశా వాళ్ళ నాన్న పై అత్యంత ఇష్టం వల్ల వచ్చిందేమో. చదువు అంతగా చదవక పోయినా ఏది తప్పు ఒప్పు అనే విషయంపై కచ్చితమైన అవగాహన ఉండేది. చూస్తుండగానే తన పదవ తరగతి పూర్తైంది.

పై చదువుల కొరకు వేరే దగ్గరకు వెళ్ళలన్నా కూడా తనకు ఇష్టమైన వైజాగ్ ను విడిచి ఉండలేక ఇంటర్మీడియట్ అక్కడే జాయిన్ అయ్యాడు. తన స్నేహితులందరు కూడా ఒకే కాలేజీ లో జాయిన్ అయ్యారు.

మిత్ర కన్నులతోనే మాట్లాడుతుంది. తను చాలా నెమ్మదైంది. ఏ విషయన్నైనా బయటకు ఎక్కువగా వ్యక్తపరచదు. తను ఎక్కువగా గడిపే ప్రదేశం ఇల్లు మాత్రమే. బాహ్య ప్రపంచాన్ని ఎక్కువగా చూడదు. తను ఉన్న దగ్గరే తన సంతోషాన్ని వెతుక్కుంటుంది. ప్రకృతి లాగానే ఎంత నిర్మలంగా ఉంటుందో అంత కంటే ఎక్కువ కఠినంగా ఉంటుంది. తను కూడా అర్జున్ చదివే కాలేజీ లోనే చేరింది. కాలేజీ ఇల్లు తప్ప వేరే ప్రదేశానికి ఆమెకు దారి తెలియదు. తన ప్రయాణం అలా సాగుతుంది.

అర్జున్ ఒక రోజు మిత్రని చూశాడు. తను అందరికన్నా భిన్నంగా ఉన్నా విషయాన్ని గ్రహించాడు. ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నం చేసేవాడు కానీ ఆగిపోయేవాడు. రోజూ తనని చూస్తూ ఉండేవాడు కానీ తను మాత్రం అతన్నిచూసేదికాదు. తెలియకుండాదే మిత్ర పై ప్రేమ పెంచుకున్నాడు. తన పుస్తకంలో మిత్ర చిత్రాన్ని, ఆమెతో చెప్పాలనుకున్న విషయాన్ని మనసులో పదిలంగా దాచుకున్నాడు. తనతో మాట్లాడే సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

మిత్ర కూడా అర్జున్ చూస్తున్న విషయాన్ని గమనించింది. అలా ఇద్దరు కళ్ళతోనే మాట్లాడుకునేవారు. మిత్రకి కూడా అర్జున్ పై మంచి అభిప్రాయం ఏర్పడింది కానీ మాట్లాడేదికాదు. అర్జున్ మిత్ర పై ఉన్న విషయాన్ని తన స్నేహితులతో చెప్పేవాడు. వాళ్ళు కూడా వారిద్దరిని ఎలాగైనా కలపాలనే ప్రయత్నం చేసేవారు. మిత్రని తను ఎంతగా ప్రేమిస్తున్నాడో ఉత్తరం రాశాడు, కానీ మిత్రకి ఇద్దామంటే భయం తను ఎక్కడ కాదంటుందో అని.

ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యాయి ఎంత కాలమైనా అర్జున్ తన ప్రేమను చెప్పలేదు. పరీక్షలు అయిపోగానే మిత్ర వాళ్ళ అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అర్జున కి మిత్ర ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. మిత్ర వాళ్ళ నాన్నని అడుగుదాం అన్నా ధైర్యం చాలేది కాదు. ఒకరోజు అడగ్గా తను వాళ్ళ అమ్మమ్మ దగ్గర ఉందని అక్కడి నుండే కాలేజీకి వెళ్తుందని వాళ్ళ నాన్న చెప్పాడు. అలా తన కోసం ఎదురుచూస్తూ సంవత్సరం గడిచింది. తను ఎప్పటికైనా తిరిగివస్తుందని తానపై ఇష్టాన్ని వ్యక్తపరచాలని తన జ్ఞాపకాలతోనే ఉండేవాడు. ఆ రోజు రానే వచ్చింది. మిత్ర ఊళ్ళోకి వచ్చిందనే విషయాన్ని తన స్నేహితుల ద్వారా తెలుసుకున్నాడు. తను పట్టరాని సంతోషంతో ఉన్నాడు. తనని చూడాలనే ఆరాటంతో హడావిడిగా మిత్ర ఇంటికి వెళ్ళాడు. మిత్ర తనని చూసి ఎలా ఉన్నావు అర్జున్ అని తానే మొదటగా మాట్లాడింది, కాసేపు అలా వారి మధ్యన ముచ్చట సాగింది. కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజుయి అర్జున్ స్నేహితులు ఇంకా ఎప్పుడు చెపుతావు తనపై ఉన్న ఇష్టాన్ని ఇన్ని రోజులుగా నీలోనే దాచుకుని భాడపడ్డావు. ఇప్పుడు చెప్పు అని అన్నారు. అర్జున్ అప్పుడు తన స్నేహితులతో ప్రేమించడం అందరు చేస్తారు కానీ దాన్ని అందరు వ్యక్తపరచలేరు. ఒకవెళ నేను చెప్పినా కూడా మిత్ర నా మీద ఇష్టం లేదని అంటుందేమో అని... అలా అంటే మాత్రం నేను తట్టుకోలేనని అన్నాడు.

మిత్ర నుండి ఆ మాట వస్తుందనే భయం అర్జున్ ను ఇన్నాళ్ళు ఆపింది. మరుసటి రోజు మిత్ర నేను రేపు వెళ్తున్నా అని చెప్పింది. మిత్రకి కూడా అర్జున్ పై ఇష్టం ఉంది కానీ చెప్పలేక ఆగిపోయింది. ఆ రోజు మొత్తం దిగులుతో ఇంట్లోనే ఉండిపోయాడు. మిత్ర వెళుతుంది అని తెలిసినా తను ఇక ఎప్పుడు వస్తుందో అనుకుంటూ బాధ పడ్డాడు.

సాయంత్రం ఒక్కడే సముద్రపు తీరాన కూర్చున్నాడు. ఎప్పుడూ సముద్రాన్ని చూస్తూ ప్రశాంతంగా ఆస్వాదిస్తూ సంతోషంగా ఉండే అర్జున్ దిగులుతో ఉన్నాడు. మిత్ర అర్జున్ దగ్గరికొచ్చింది అర్జున్ తనని చూసి కంటనిండా వచ్చే నీటిని ఆపుకుని మూగబోయిన గొంతుతో నువ్వు ఇంకా వెళ్లలేదా అని అడిగాడు. మిత్ర నేను చిన్నపటినుండి ఇంతే అర్జున్ ఇష్టాన్ని బాధని బయటికి చెప్పలేను. నువ్వు ప్రతిసారి నా కోసం చూస్తూ నా పక్కన నిల్చున్నావు. ప్రతిసారి నువ్వు చెప్పాలనుకున్న మాట నాకు వినిపించింది. ఇప్పుడూ నీ ముందే నిల్చున్న నీకోసం, నీపై ఉన్న ఇష్టం గురించి నన్ను చూస్తుంటే తెలియట్లేదా! అని గట్టిగా ఏడ్చేసింది.

“జీవితంలో పరిచయాలు సహజమే కానీ కొందరే మనసుకు దగ్గరవుతారు, నచ్చుతారు వారి దగ్గరే మనం ఆగిపోతాం.”

జె. గణేశ్
బీఎస్సీ (ఎంఎస్ సిఎస్) రెండో సంవత్సరం

# బలగం సినిమా సమీక్ష

బంధు మిత్రులే నా బలం ఈ సమాజమే నా బలగం అంటూ నటుడు వేణు దర్శకత్వం లో ప్రియదర్శి , కావ్య కల్యాణ్ రామ్ జంటగా వచ్చిన సినిమా 'బలగం'. ఈ సినిమాని హర్షిత్ రెడ్డి , హన్షిత నిర్మించారు. ప్రతీ ఒక్కరూ కుటుంబ సమేతంగా చూసేవిధంగా ఈ సినిమా తీయడం జరిగింది. ఈ సినిమా ప్రతి ఒక్కరి మనసును కదిలించేలా ఉంటుంది. ఈ సినిమాలోని పాటలలో అద్భుతమైన పల్లెటూరి ప్రకృతిని అలాగే అనుబంధాలను మరియు భాద్యతలను చూపించారు.

బలగం సినిమా ప్రతి మనిషి తెలుసుకోవలసిన బాధ్యతలను తెలియజేసింది. ఈ సినిమాలోని కథ తెలంగాణలో ఓ మారుమూల పల్లెలో జరిగే ఒకానొక సంఘటన. కథానాయకుడు సాయిలు ఓ నిరుద్యోగి. సాయిలు వాళ్ళ ఇంటి పెద్ద మరణం చుట్టూ సాగే కుటుంబ కథ ఇది. మన కుటుంబ అనుబంధాల్లోని బలాన్ని ..... నమ్మకాన్ని ఆచారాల్ని అత్యంత సహజంగా ఆవిష్కరిస్తుంది. మన రోజువారి సంస్కృతి, మూలాలలోనే మనసుల్ని కదిలించే ఎన్నో కథలున్నాయని ఈ చిత్రం చాటి చెబుతుంది. తెలంగాణలోని చావు చుట్టూ జరిగే తతాంగాన్ని పక్కాగా ఆవిష్కరిస్తూనే, ఓ కుటుంబంలోని సంఘర్షణని అందరికి కనెక్ట్ అయ్యేలా సినిమా తెరకెక్కించారు దర్శకుడు.

మనిషి తన జీవితంలో డబ్బు కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఆ డబ్బు ఎక్కువ అవ్వడంతో ఎదుటి వారిని చులకనగా చూసే స్థాయికి వచ్చాడు. రోజురోజుకి ఈ సమాజంలో అనుబంధాలు కనుమరుగవుతున్నాయి. ఈ సినిమాలో ఇరవైయేళ్ల కిందట ఏం జరిగింది, చిన్న చిన్న విషయాలే మషుల్ని ఎలా దూరం చేశాయో, ఇద్దరి మధ్య అహం కుటుంబంలో ఎలాంటి సంఘర్షణకి దారి తీస్తుందో ఆసక్తికరంగా చూపించారు.

పల్లె యాసలో మరియు వారిమాటల్లో ఊరి మీద ఉన్న ప్రేమ ఎంతో అద్భుతంగా చిత్రీకరించడం జరిగింది. ఒగ్గు కథను ఈ సినిమాలో ప్రదర్శించిన తీరు బాగుంది. అన్న చెల్లెళ్ళ మధ్య అనుబంధాన్ని , కుటుంబ నేపథ్యంలో భావోద్వేగాల్ని ఎంతో అద్భుతంగా చిత్రించారు.

బలం అంటే శారీరక శ్రమయే కాదు మనం ఆపదలో ఉన్నప్పుడూ ఆదుకునే మన కుటుంబమే మన బలం బలగం. అన్న విషయాన్ని ఈ చిత్రం ద్వారా చూపెట్టారు.

**సంక్షిప్త కథ:**

కొమురయ్య మనుమడు సాయిలు పెళ్ళికి సిద్ధమవుతాడు. రెండు రోజుల్లో నిశ్చితార్థం అనగా ...అతని తాత చనిపోతాడు. అప్పటికే సాయిలు అప్పుల్లో మునిగిపోతాడు. వరపూజ రోజున పది లక్షల కట్నం వస్తే అప్పు తిరుద్దామని ఆశ పడిన అతడికి నిరాశే మిగులుతుంది. చావు ఇంట్లో జరిగిన గొడవ కారణంగా ఆ పెళ్లి కూడా రద్దవుతుంది. తన తాతయ్య భౌతిక కాయం చూడటానికి వచ్చిన మేనత్త కూతురు సంధ్యను చూసి ప్రేమలో పడుతాడు సాయిలు. సంధ్య తండ్రికి చాలా ఆస్తి ఉందని తెలిసి ఎలాగైనా సంధ్యను ప్రేమించి, పెళ్లి చేసుకుని అప్పు తీర్చేద్దామని ఆలోచన చేస్తాడు. అందుకు చనిపోయిన తనతాతను కూడా వాడుకున్నాడు.

**ముగింపు:**

కథ పాత్రల పరంగా ఎలాంటి వంకపెట్టలేని పనితీరు కనిబర్చారు దర్శకుడు వేణు. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో, యాసలో వచ్చిన ఈ చిత్రంలో కొన్ని నేటివిటీ అంశాలు చాలా బాగున్నాయి. సహజమైన చిత్రాల్లో ఒకటిగా ఈ బలగం సినిమా నిలిచిపోయింది. ఈ సినిమాలో అనుబంధాలు ప్రేమ గురించి ఎంతో అద్భుతంగా చిత్రీకరించారు. మానవీయ విలువలు మరియు భావోద్వేగాలను అన్వేషించటం ఒక వ్యక్తి మరణంతో ముడిపెట్టడం అనేది చాలా గొప్ప ఆలోచన.

# ఆవేదన (లేఖ)

కన్న కూతురు తన మనసులోని బాధను ఆవేదనను తన తండ్రికి చెప్పే ధైర్యం లేక ఎదురుగా నిలబడే ధైర్యం చాలక మనసంతా కన్నీటితో నిండిన బాధతో రాస్తున్న చివరి లేఖ. పూజనీయులైన నాన్నగారికి మీ కుమార్తె నమస్కరించి రాయునది ఏమనగా! నేను మీతో ఎంతో మాట్లాడాలని మీకు ఎప్పటినుంచో నా మనసులోని బాధని ఆవేదనను ఎదురుగా నిలబడి చెప్పాలని మీరు నాకు ఆ అవకాశం ఎప్పుడూ ఇవ్వలేదు. ఎంతసేపు మీ గురించి మీరు ఆలోచించుకున్నారే గాని పిల్లల గురించి గానీ కుటుంబ భావితరాల గురించి గానీ వారి ఇష్టా ఇష్టాలు ఏంటి అని తెలుసుకోలేకపోయారు. మన పరిస్థితి చూసి మీ ఎదుట నిలబడే ధైర్యం చేయలేక మీతో నా బాధను చెప్పుకోలేక ఈ విధంగా ఉత్తరం రాస్తున్నాను. ఇది చదివైనా మీరు మారతారేమోనని మిగిలిన పిల్లల భవిష్యత్తుని ఒక మంచి మార్గంలోనైనా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను.

పిల్లలకు తల్లిదండ్రుల అవసరం చాలా ముఖ్యం పిల్లల కోసం తల్లిదండ్రులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటారు వాళ్ల సంతోషం కోసం మీ సంతోషాలని త్యాగం చేస్తారు. కుటుంబం అనేది ఒక బండి లాంటిది అందులో తల్లి తండ్రి రెండు చక్రాలు లాంటివారు అందులోని ఏ ఒక్క చక్రం విరిగిపోయిన ఇంకా బండి ముందుకు సాగడం చాలా కష్టం కానీ నా జీవితంలో అమ్మ చనిపోయిన దగ్గర నుండి ఈ ఇల్లు నరకప్రాయం అయింది. నా సమస్యలను చెప్పుకోలేక చావలేక బ్రతుకుతున్నాను. ఇన్నాళ్లు అమ్మలేదని అమ్మలేని లోటును నువ్వైనా తీరుస్తావని ఎదురు చూశాను కానీ నా ఆశ నిరాశగానే మిగిలిపోయింది. మారతావని ఆశ చచ్చిపోయింది. తల్లి లేకపోయినా తండ్రి అయినా సరిగ్గా మమ్మల్ని చూస్తాడని నమ్మకంతో ఇన్నాళ్లు బ్రతుకుతున్నాను కానీ ఆ అదృష్టం కూడా లేదు మాకు మా భవిష్యత్తు ఎలా ఉంటుందో కూడా తెలియనంతగా మారిపోయావు, ఏదైనా బాధ కలిగితే చెప్పుకోవడానికి అమ్మ లేదు ఎందుకంటే అమ్మ చనిపోయిన తర్వాత నువ్వు మమ్మల్ని పట్టించుకోవడం మానేశావు, తాగుడికి బానిస అయ్యావు ఎక్కువగా ప్రేమించిన వాళ్ళు చనిపోతే ఆ లోటు తీరలేనిది కానీ ఆ బాధని మర్చిపోవడానికి మీరు తాగుడే మార్గం అని ఎంచుకున్నారు. దానివల్ల మిమ్మల్ని నమ్ముకుని ఉన్న వాళ్ళు ఏమవుతారో వాళ్ళ జీవితాలు ఎలా ఉంటాయో అని మాత్రం మీరు ఆలోచించలేదు ఆలోచించే పరిస్థితిని కూడా మీరు దాటిపోయారు.

మేము తిన్నామా,ఉన్నామా అని కూడా చూడలేనంతగా మారావు తల్లి లేకపోయినా తల్లేని లోటు తీరుస్తావని ఆశతో ఇన్నాళ్లు బ్రతికాను కానీ ఆ ఆశ కూడా ఇప్పుడు చచ్చిపోయింది. అలా అని మిమ్మల్ని నేను వదులుకోలేను, వదిలి నేను ఉండలేను. ఆడపిల్లగా పుట్టినందుకూ తల్లి తండ్రి మీద, పెళ్లి అయినంక భర్త మీదా, పిల్లలు పుట్టాక కొడుకు మీద ఇలా ఎవరో ఒకరి మీద ఆధార పడవలసిందే కదా! అమ్మలేని లోటు ఎంత బాధాకరమో నాకు తెలుసు కానీ, మీకు ఏదైనా జరిగిన అంతకన్నా ఎక్కువగా మేము బాధపడ పడవలసిందే కదా. తాగుడే అన్ని సమస్యలకు పరిష్కారం అనుకుంటే ఈ లోకంలో అందరూ అదే మార్గాన్ని ఎన్నుకుంటారు, మిమ్మల్ని మార్చాలని నేను ఎన్ని విధాలుగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు మీరు మారలేదు. నాకు ఊహ తెలిసినప్పటి నుండి మన కుటుంబం ఎంతో సంతోషంగా ఉండేది. నేను అమ్మతో గడిపిన క్షణాలు కూడా నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. నేను నా చిన్నతనంలోనే  అమ్మను కోల్పోయాను. అమ్మను కోల్పోయిన సంవత్సరంలోనే మీరు రెండో పెళ్లి చేసుకున్నారు కానీ అది మాకు ఇష్టమా లేదా అని మీరు ఆలోచించకుండానే మీరు నిర్ణయం తీసుకున్నారు. పోనీ ఆ అమ్మ అయిన మమ్మల్ని ప్రేమగా చూసుకుంటుందేమోనని ఆశపడ్డాను ఆ అమ్మ ప్రేమ కూడా నాకు ఎక్కువ రోజులు దక్కలేదు. ఎంతైనా సవతి తల్లి ప్రేమ వాళ్ళ పిల్లల మీద ఉంటుంది కదా అందుకేనేమో మమ్మల్ని దూరం పెట్టింది. అప్పుడు కూడా మేము మా బాధను చెప్పాలని ప్రయత్నించిన కూడా ఆ అవకాశం కూడా మీరు మాకు ఇవ్వలేదు ఆడదానికి ఓర్పు సహనం ఎంతో అవసరం కానీ ఆ రెండు కోల్పోయిన రోజున ఈ జీవితం ఎందుకనే ప్రశ్నగా మిగిలిపోయింది ఆ సమయంలోనే తప్పుడు నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుంది.

ఇప్పుడున్న పరిస్థితి కూడా ఆ తప్పుడు నిర్ణయం తీసుకునేలా చేసింది కాదు చేసేలా మీరు చేశారు. కనీసం ఈ ఉత్తరం చదివైనా మీరు మారతారేమోనని అనుకుంటున్నాను మీరు మారితే నా ఆత్మ సంతోషిస్తుంది. నా జీవితంలో కాకుండా మీరు మిగతా వాళ్ళని ప్రేమగా వాళ్లకు దగ్గరగా ఉండడానికి ప్రయత్నించండి కనీసం మీరు నా చావుతోనైనా నేను మిమ్మల్ని మార్చగలనేమోనని ఒక చిన్న ఆశ కానీ, ఎప్పటికైనా ఇంకో జన్మంటూ ఉంటే మీకు కూతురిగా పుట్టాలని కోరుతున్నాను అప్పుడైనా తల్లితండ్రుల ప్రేమను పొందాలని కోరుకుంటూ!

.......మీ కూతురు.

జి. గౌతమి

బీఎస్సీ ఎపిసిఎస్ రెండో సంవత్సరం

# పదకేళి

## తప్పొప్పులు

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

| | | |
|---|---|---|
| 1. | వ్యత్యాసం( ) | వత్యాసం( ) |
| 2. | గ్రంథం( ) | గ్రంధం( ) |
| 3. | వ్యవస్త ( ) | వ్యవస్థ ( ) |
| 4. | ఆశక్తి( ) | ఆసక్తి( ) |
| 5. | విద్వంసం( ) | విధ్వంసం( ) |
| 6. | సారస్వతం( ) | సారసత్వం( ) |
| 7. | ప్రథమ( ) | ప్రధమ( ) |
| 8. | అధితి( ) | అతిథి ( ) |
| 9. | బాధ( ) | భాధ( ) |
| 10. | అధిక్యత( ) | ఆధిక్యత( ) |

సమాధానాలు: తదుపరి పత్రికలో

**ప్రతిభ- ద్వైమాస పత్రిక (నవంబర్, డిసెంబర్)**
**పదకేళి సమాధానాలు**

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

1. పేలవమైన
2. రథం
3. ప్రత్యర్థి
4. క్రోధం
5. బోధన
6. దృఢత్వం
7. బంధం
8. స్వేచ్ఛ
9. సామర్థ్యం
10. వ్యతిరేకం

# సాహిత్య రత్నాలు

## పింగళి లక్ష్మీకాంతం
## (జననం: జనవరి 10, 1894)



పింగళి లక్ష్మీకాంతం 1894 జనవరి 10 న కృష్ణా జిల్లా ఆర్తమూరులో జన్మించారు. ఈయన స్వగ్రామం చిట్టూర్పు. వీరి తల్లిదండ్రులు వెంకటరత్నం, కుటుంబమ్మ. ప్రాథమిక విద్యాభ్యాసం రేపల్లెలో పొందిన తరువాత మచిలీపట్నంలోని హిందూ ఉన్నత పాఠశాల మరియు నోబుల్ కళాశాలలో చేశారు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పట్టా పొందారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రికి శుశ్రూష చేసి, సంస్కృతాంధ్రాలలో బాగా పఠించి వారి శిష్యులలో అగ్రగణ్యులయ్యారు. నోబుల్ కళాశాలకు చెందిన పాఠశాలలో ఆంధ్ర పండితుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధన విభాగంలో కొంతకాలం పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులోను మరియు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోను ఆంధ్రాచార్యులుగా అధ్యక్షులుగా పనిచేసారు.

**రచనలు**

1. ఆంధ్ర సాహిత్య చరిత్ర
2. సాహిత్య శిల్ప సమీక్ష
3. మధుర పండిత రాజము
4. సంస్కృత కుమార వ్యాకరణము
5. గంగాలహరి మొదలగునవి

వీరు పాండవోద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షస మంత్రిగా పాత్రలు చక్కగా పోషించి పేరుపొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వీరికి విశిష్ట సభ్యత్వం ఇచ్చి సత్కరించింది.

వీరు 1972 సంవత్సరం జనవరి 10 తేదీన పరమపదించారు.

# మాడపాటి హనుమంత రావు
# (జననం: జనవరి 22,1885)



**మాడపాటి హనుమంతరావు 1885 జనవరి 22వ తేదీన నేటి వరంగల్ జిల్లా మధిర తాలూకా ఎర్రుపాలెం గ్రామంలో జన్మించారు. తల్లి జమలాపురం వారి ఆడబడుచు వేంకట సుబ్బమ్మ. తండ్రి వేంకటప్పయ్య. తండ్రి మరణంతో నల్లగొండలో పని చేస్తున్న చిన్న మేనమామ రామచంద్రరావు వద్ద వీరు చదువుకున్నారు.**

హనుమంతరావు వరంగల్‌లో మద్రాసు మెట్రిక్ పాసయ్యారు. ఎనిమిది సంవత్సరాలు వరంగల్‌లో విద్యాశాఖలో పనిచేశారు. ఆయన ఉద్యోగానికి సెలవుపెట్టి హైదరాబాద్‌లో ప్రైవేటుగా 'లా' పరీక్ష పాసైయ్యారు.

రచనా ప్రస్థానం:

**హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి.**

1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం హనుమంతరావుకు డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ మొదటి అధ్యక్షులుగా ఆరేళ్లు మాడపాటి కొనసాగారు. ఆంధ్రాభ్యుదయమే తమ జీవితంగా భావించిన మాడపాటికి భారత ప్రభుత్వం 1955 జనవరి 26న పద్మభూషణ్ బిరుదునిచ్చి సత్కరించింది. తెలంగాణాలో ఆంధ్రోద్యమంతోపాటు అనేక సాంఘిక, సామాజిక ఉద్యమాలకు సారథ్యం వహించి, ఆంధ్ర పితామహుడనే పేరు గాంచిన మాడపాటి హనుమంతరావు 1970 నవంబర్ 11వ తేదీన 86వ ఏట తనువు చాలించారు.

# షేక్ నాజర్ (బుర్రకథ పితామహుడు) (జననం: ఫిబ్రవరి 5,1920)



బుర్ర కథా పితామహుడుబుర్ర కథా పితామహుడుగా పేరు పొందిన "షేక్ నాజర్". బుర్ర కథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. గుంటూరు జిల్లా పొన్నేకల్లు గ్రామంలో ఓ పేద దిద్దెకులముస్లిం కుటుంబంలో 1920 ఫిబ్రవరి 5వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీల దంపతులకు జన్మించారు.

నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వాలి ". రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడ వేషాలు వేసి మెప్పించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోసారని ప్రముఖ పోర్మోనిస్టు ప్రశంసించారు. ఖాదర్ ఆయనను "మురుగుళ్ళ" వద్దకు సంగీతం నేర్చుకోవాలని అప్పగించారు. పేదరికం వల్ల అచట ఉండలేకపోయారు. ఆర్య మత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్య పతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. నాస్తికుడయ్యారు. కొమ్మినేని బసవయ్య గారి పిల్లలకు సంగీతం నేర్పటం నాటకాలు ఆడించడం ద్వారా సంగీత గురువయ్యారు. ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి,మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహారంతో తగిన హావ భావాలతో ఎన్నో ప్రదర్శన లిచ్చి బుర్రకథ పితామహుడు నాజర్. "ఈ గండపెండెరాలూ, ఊరేగింపులూ సన్మానాలు,పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసి ఒక ఈ లతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికి అంకితం చేసిన ప్రజా కళాకారుడు.

ఆంధ్ర నాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986లో భారత ప్రభుత్వం" పద్మశ్రీ" బిరుదు నాజరును సత్కరించింది. నాజర్ ఆత్మకథ "పింజారి "చిన్న గ్రంథమే కానీ ఇందులో అతని జీవిత చరిత్ర మొత్తం సవినయంగా చెప్పుకున్నారు. 1997 ఫిబ్రవరి 22న అంగలూరులో మరణించారు.

# శ్రీశ్రీ
# (జననం: 1910 ఏప్రిల్ 30)

ఇరవయ్యో శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి **శ్రీశ్రీ**. ఈయన విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ప్రసిద్ధుడు. ఆయన హేతువాది, నాస్తికుడు. మహాప్రస్థానం అతని రచనల్లో ప్రసిద్ధమైనది.



**శ్రీశ్రీ** 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు జన్మించాడు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్త పుత్రుడు అవ్వడం వలన ఇతని ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేసారు. 1925లో ఎస్ ఎస్ ఎల్సి పాసయ్యారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మతో పెళ్ళి జరిగింది. 1931లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బి.ఏ (జంతుశాస్త్రము) పూర్తి చేసారు.

1950లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసీ మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవిని చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలను రచించారు.

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21)

**అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం** ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది.

బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు.1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు.పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించింది.

# మీకు తెలుసా!

వాక్కు అంటే మాట అని అర్థం. మాటలన్నీ కూర్చి రాగం కడితే పాట. పాడితే గేయం. పాటని రచయిత వ్రాస్తే, రాగం సంగీతకారులు కడితే, గానం గాయకులు చేస్తారు. ఈ మూడు పనులూ ఒక్కరే చేయగలిగితే వారిని **వాగ్గేయకారులు** అంటారు. అంటే పాటని రచించి స్వరపరిచి, పాడగలిగే వాళ్ళు అని అర్థం.

ఈ వాగ్గేయకారుల సంప్రదాయం ప్రాచీనం నుండి ఆధునిక కాలం వరకు విస్తరించి ఉంది. ప్రాచీన కాలంలో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు, క్షేత్రయ్య మొదలైన వారు గొప్ప వాగ్గేయకారులుగా ప్రసిద్ధి చెందారు. క్షేత్రయ్య మువ్వలోని వేణుగోపాల స్వామిపై మువ్వగోపాల పదాలు వ్రాశారు. అన్నమయ్య,రామదాసు,త్యాగరాజు లను తెలుగు వాగ్గేయకారత్రయంగా పిలుచుకుంటాం. అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామి మీద ఎన్నో సంకీర్తనలు రాశారు. అలాగే “తందనాన అహి తందనాన పురే” అంటూ సమాజ శ్రేయస్సుకు పాటుపడ్డారు. భద్రాచల రామదాసుగా పేరొందిన కంచెర్ల గోపన్న కూడా శ్రీరాముడి మీద ఎన్నో సంకీర్తనలను వ్రాశారు. ఈయన కీర్తనలు మొత్తం కూడా భక్తితో కూడినవి.

త్యాగరాజు గారి కీర్తనలు కర్ణాటక సంగీత సాంప్రదాయంలో అతిప్రసిద్ధమైనవి. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజు.

ఆధునిక కాలంలో కూడా సుద్దాల హనుమంతు, గోరటి వెంకన్న, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అందెశ్రీ, గద్దర్, జయరాజు మొదలయిన వాగ్గేయకారులు  సమాజంలోని వివిధ సమస్యలను తమ ధోరణిలో సమాజాన్ని చైతన్యపరుస్తున్నారు.

తెలుగు వాగ్గేయకార త్రయం



అన్నమయ్య



త్యాగరాజు



శ్రీ రామదాసు

# ఓ మంచి పద్యం

## పద్యం:

**తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లన్ బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ!
ఫుల్లబ్జాక్షి !సరస్వతీ !భగవతీ !పూర్ణేందు బింబాననా!**

## భావం:

అమ్మా సరస్వతీమాత! పుస్తకం పట్టుకోడానికి ముందు నిన్ను మనసున స్మరించి, పిమ్మట చదువు మొదలుపెడుతున్నాను తల్లీ! ఓ వికసించిన కలువల వంటి విజ్ఞానము ప్రసరించే కన్నులు కల తల్లీ! నిండు చంద్రుని వంటి మోము కల చల్లని తల్లీ! జగన్మోహిని! నా ఉల్లము (మనసు) నందు ఉండి, నా వాక్కులు సుశబ్దాలుగా శోభిల్లాలని ప్రీతితో పలుకు తల్లీ!

పూర్వం ఈ పద్యాన్ని పఠించి సరస్వతి మాతను స్మరించిన తర్వాతనే పుస్తక పఠనం చేసేవారు. ఈ పద్యాన్ని ప్రస్తుతం ప్రార్థనా పద్యంగా వాడుతూ ఉంటాము.

# పదవినోదం

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | 3 | 4 | 5 |
| | 6 | | | | | |
| | 7 | 8 | | | | |
| 9 | 10 | | | 11 | | |
| | 12 | | 13 | | | |
| 14 | | | | 15 | | 16 |
| | 17 | | | 18 | | |

అడ్డం:

1. రక్తపాతంలేని రణరంగం (4)
2. నది (3)
4. సంధి (2)
6. అష్టాదశ వర్ణన (3)
7. ఇల్లు పీకి _____ వేసినట్టు (3)
8. మూడు చక్రాల వాహనం (2)
9. మగవారు సాంప్రదాయకంగా ధరించే వస్త్రం (2)
10. శీతలము (2)
11. విజయం (3)
12. ఒక జ్ఞానేంద్రియం (2)
13. భగవంతుడు కల్కిగా అవతరించడం (2)
17. తెలంగాణ పూర్వపదం (3)
18. వ్యాయామ సాధనల సమాహార ఆధ్యాత్మిక రూపం (2)

సమాధానాలు: తదుపరి పత్రికలో

**నిలువు:**

1. కొడవటిగంటి కుటుంబరావు నవల (3)
2. చందనం (2)
3. హిందూ ఆరాధ్య జంతువు (2)
4. బ్రహ్మ, విష్ణువు, శివుడు (4)
5. చేయి (3)
6. జగత్తు (4)
8. మైటోకాండ్రియాలోని కణాంగం (3)
9. వరాహం (2)
10. ఒక ఇంధనం (3)
11. ఒక భౌతిక శాస్త్రవేత్త (4)
13. నయనం (2)
14. ధాన్యం నిలువ చేసేది (2)
16. తండ్రి (2)

ప్రతిభ - ద్వైమాసిక పత్రిక (నవంబర్. డిసెంబర్)
పదవినోదం సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1. జా | ఘ | 2.వ | ర | ద |
| న | 3.దా | న | వీ | ర |
| 4.కి | రి | 5.జ | యం | తి |
| ర | 6.ఆ | ము | 7. దం | 8.డ |
| ణం | కు | న | తం | ప్పు |

# కళాశాల వార్తా కదంబం







అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) – 'తెలుగులో మూడు నిమిషాలు' వక్తృత్వ పోటీ






జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సంస్కృతి ఫౌండేషన్ వారి
సౌజన్యంతో సర్వే ఆఫ్ ఇండియాకు విజ్ఞానయాత్ర – ఫిబ్రవరి 28






ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల అవగాహన సదస్సు – ఏప్రిల్ 14




ఇంజాపూర్ గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ స్పెషల్ క్యాంపు

జిజ్ఞాస రాష్ట్ర స్థాయి స్టడీ ప్రాజెక్టు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు










తెలుగు ప్రాజెక్టు

కామర్స్ ప్రాజెక్టు




మార్చి 3,4 తేదీల్లో జరిగిన వికీపీడియా టెక్నాలజీ సమ్మిట్ లో విజిడిసి రెండవ సంవత్సరం విద్యార్థి -ఎస్. అనిల్




ఏప్రిల్ 27,28,29 తేదీల్లో జరిగిన వికీపీడియా ఇండియన్ కాన్ఫరెన్స్ నిర్వాహకులతో విజిడిసి రెండవ సంవత్సరం విద్యార్థులు – నితిన్, ఎస్. అనిల్










మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో మహిళలు - ఆరోగ్యం ఎక్స్టెన్షన్ లెక్చర్

ముఖ్య వక్త: డా. ఎస్. కామేశ్వరి గారు, ప్రముఖ గైనకాలజిస్ట్




సంస్కృతి ఫౌండేషన్ సహకారంతో భారతీయ క్రీడలు – అవగాహనా కార్యక్రమం – జనవరి 19



కాకతీయుల కాలంలో క్రీస్తు శకం 1213లో నిర్మించిన **రామప్ప దేవాలయానికి** ప్రపంచ వారసత్వ హోదా దక్కింది. చైనాలోని పూజౌలో నిర్వహించిన యునెస్కో హెరిటేజ్ కమిటీ సమావేశాలలో ప్రపంచం వ్యాప్తంగా 21 దేశాల ప్రతినిధులు ఓటింగ్ ప్రక్రియలో పాలుపంచుకొన్నారు. 17 దేశాల వారు రామప్పకు అనుకూలంగా ఓటు వేశారు. రామప్పకు వారసత్వ హోదా ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకున్నారు. 2021 జులై 25న ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించబడింది.

ప్రాచీన కట్టడమైన రామప్ప దేవాలయానికి వారసత్వ హోదా గుర్తింపునకు ముఖ్యంగా మూడు అంశాలను ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం యునెస్కోకు నామినేట్ చేసింది. అవి:

- **ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం**
- **నీటితో తేలియాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించడం.**
- **ఆలయ నిర్మాణానికి వాడిన రాయి నేటికీ రంగును కోల్పోకుండా ఉండడం.**